శివుడు రేపు వెళ్ళిపోతాడు. విజయవాడలో ఎల్లుండి జాయిను అవుతాడు. ఇంతవరకూ అన్నీ బాగానే జరిగాయి. ఇంకముందెలాగ ఉంటుందో? ఆరు వందలతో సాగుతూ వచ్చిన సంసారం— రేపటి నుంచి మూడు వందలకి సర్దుకోవడం నేర్చుకోవాలి. శివుడికి బదిలీ రాకపోయినా బాగుండేది. పాపం, వాడూ శాయశక్తులా బదిలీ ఆపుచేసుకుందుకు ప్రయత్నించక పోలేదు. కాని, వాడి ప్రయత్నాలు ఫలించలేదు. అధికారుల ఆజ్ఞలు అనుల్లంఘనీయాలు.

ఇంతవరకూ ఉమ్మడిగా ఉంటూ వచ్చారు కనక బతుకులు కొంతవరకూ సాఫీగానే వెళ్ళిపోయాయి. కష్టమయినా, సుఖమయినా విభక్తం కావడంతో ఏదీ పెద్దగా మనసుకి పట్టలేదు ఇద్దరికీ.

రేపటి నుంచి ఇలాగ జరగదు.

తలుచుకుంటూంటే భయమేస్తూంది. కాని, తప్పదు. ఎదుర్కోవలసిందే. భరించి తీరవలసిందే. బతకదలుచుకుంటే కష్టాలూ, నిష్ఠూరాలూ, సహించడం అలవాటు చేసుకోవలసిందే. మధ్యతరగతి బతుక్కి మార్గాంతరం లేదు. ఎంత ఒడిపోతున్నా జీవితంతో, పరిస్థితులతో, పెరిగే ధరలతో, ఎదిగే కుటుంబంతో రాజీపడి తీరవలసిందే.


చిత్రమేమిటంటే — శివుడికి బదిలీ అయి వాళ్ళిద్దరూ వెళ్ళిపోవడం శ్యామలకి సంతోషంగా ఉన్నట్లుంది. చిన్నపిల్ల, పైగా ఆర్థిక సమస్యల గురించి ఆలోచించవలసిన అవసరం లేని ఇల్లాలు, సుఖజీవి. ఇద్దరే ఉండడంలోని స్వేచ్ఛనే చూడగలుగుతూంది. కాని, శివుడి సమస్యల గురించి ఆలోచించడం లేదు. అవును. అవన్నీ ఆమె కెందుకు? సంపాదించవలసిన వాడు మగవాడు. నైమిశారణ్యం లాంటి ఈ లోకంలో నానా యాతనలూ పడి, నాలుగు డబ్బులు తెచ్చి ఇల్లు గడపవలసిన బరువూ, బాధ్యతా మగవాడివే. నిజంగా ఆడబతుకే మధురమేమో? మధురమయినా, కాకపోయినా సమస్యారహితమన్న దానిలో రవంతయినా సందేహం లేదు. ఇల్లాళ్ళు అదృష్టవంతులు, ఆ మేరకు.

విజయవాడలో శివు డెలాగ బతుకుతాడో?

వాడికీ తనలాగే చేతి కందేవి మూడు వందలే. విజయవాడ కూడా విశాఖపట్నంలా మధ్యతరగతి మనిషి జీవితాన్ని ఆర్థికంగా గానుగలో నలిపి నలిపి వదిలేదే. కనీసం వాడయినా తనలాగ గుమాస్తా కాక ఆఫీసరూ, అర్థవాపరుడూ అయితే బాగుండేది.

తన ఆలోచనలకి తనకే నవ్వొచ్చింది.





దిగులు చిత్రం— సి. హెచ్. జయలక్ష్మి (గుంటూరు)

గతజల సేతుబంధనం అనిపించింది. మళ్ళీ రేపటి గురించి ఆలోచనలు కందిరీగల్లా చెలరేగాయి.

ఈ బదిలీకి రూపాంతరం వేర్పాటే. పంచుకుందుకు చెంబూ, తప్పేలా తప్ప మడులూ, మాన్యాలూ లేవు కనక తమ్ముడూ, తనూ వీధిన పడ నవసరం లేదు. మధ్యవర్తులను పిలవ నవసరమూ లేదు. ఎవరుమాత్రం పట్టుకు వేలాడ డానికి ఏముంది పడిపోయాయని? అయ్యవారి నట్టిల్లు, అటుకులు తిని ఆకులు పారేసినట్లే నడుస్తూ వచ్చింది సంసారం. ఇద్దరు గుమాస్తాలూ ఆరు వందలు తెచ్చేవారు కనక కొంచెం జాగ్రత్తగా, పొదుపుగా సుఖాల జోలికి పోలేదు కనక అప్పులు చెయ్యకుండా సంసారం నెట్టుకొచ్చారు. కుటుంబం వీథిని పడకుండా ఇద్దరూ కాపాడుకో గలిగారు.

రేపటినుంచి ఏం కాబోతూందో ఆ పరమాత్ముడికే ఎరుక.

తమ్ముణ్ణి తలుచుకుంటూంటే మరీ జాలి వేస్తోంది.

సత్యం ఆలోచిస్తూనే కూర్చున్నాడు.

"అన్నయ్యా!" అంటూ వచ్చాడు శివుడు.

"రారా. టిక్కెట్లు కొనేశావా? లగేజికి ..."

"అన్ని ఏర్పాట్లూ అయ్యాయి, అన్నయ్యా! టికెట్లు రేపే తీసుకోవచ్చు." శివుడి గొంతు ఉత్సాహంగా లేదు. సత్యం ఎదురుగా కూర్చున్నాడు.

ఇచ్ఛాపురపు రామచంద్రం

ఇద్దరూ మౌనంగానే ఉండిపోయారు. ఇద్దరి హృదయాలూ గుబులుగానే ఉన్నాయి.

ఏదో చెప్పాలని — చెప్పడానికి ధైర్యం చాలనట్లు — మిగిలిపోతున్నా రిద్దరి కిద్దరూ.

శివుడు చిన్నవాడు. వా డడిగితే బాగుంటుం దనుకున్నాడు సత్యం.

అన్నయ్య పెద్దవాడు. ఇలా చెయ్య అని చెప్పేస్తే, తను కాదనకుండా సరే అనేస్తే బాగుంటుం దనుకున్నాడు శివుడు.

కాలం గడుస్తూందే తప్ప ఎవరికీ ఆ విషయంలో నోరు పెగలడం లేదు.

అవును. అది మామూలు విషయం కాదు. ఆ ఎన్నిక ఎవరి తరమూ కాదు. ఎదుటి వారికే మొదటి అవకాశం ఇచ్చెయ్యాలని ఎవరికి వారే భావించే చిత్రమైన పరిస్థితి.

చివరికి సత్యమే బయటపడవలసి వచ్చింది. "తమ్ముడూ! మనిద్దరివీ ఎదుగూ బొదుగూ లేని గుమాస్తా బతుకులే. మన జీవితాలు అంతంత మాత్రం. పైగా పెరిగిపోతున్న ధరలు. అనకూడదు కానీ, మనిషికి మనిషే బరువనిపించే గడ్డు రోజులు. బంధువు వస్తే రహస్యంగా బాధపడవలసిన బతుకులై పోయాయి ..."

శివుడు తల వంచుకుని అంతా విం టున్నట్లు కూర్చున్నాడు.

"మన సంపాదనలో అదనంగా ఇద్దరిని భరించబోవడం — మనమూ వెలాగ ఉన్నా, వాళ్ళకి ఇబ్బందిగా ఉంటుంది." మాటలకి తడుముకుంటున్నాడు సత్యం.

శివుడు కనీ కనబడకుండా అంగీకార సూచకంగా తల ఊపుతూనే ఉన్నాడు. అన్నయ్య చెప్పిన ఆ ఇద్దరూ ఎవరో అతనికి తెలుసు.

"ఈ వయసులో వాళ్ళని సుఖ పెట్టడం మన బాధ్యత. మనకి చేతనైనంత మేరకి ... వాళ్ళని ... ఇబ్బంది పెట్టకుండా ..."

"అవును" అన్నాడు శివుడు.

"ఆలోచించగా నా కొకటే మార్గం స్ఫురించింది."

ఏమిటన్నట్లు చూశాడు శివుడు.

"అమ్మనో, నాన్ననో — నీ ఇష్టం వచ్చిన వాళ్ళని నీతో తీసుకెళ్ళు." ఆ మాట అనేశాక కొండంత బరువుని గుండె మీంచి దింపుకున్నట్లు తేలిక పడ్డాడు సత్యం.

ఈ సారి శివుడు ఇరుకులో పడ్డాడు. అమ్మనా, నాన్ననా?

అమ్మ అంటితే ఇంట్లో పనికి సాయం ఉంటుంది. నాన్న అయితే — నెలకి నలభై రూపాయల పెన్షను వస్తుంది. ఎవరిని తీసుకెళ్ళాలి తనతో?

"నీ ఇష్టం, అన్నయ్యా! నువ్వెలా చెపితే అలాగే చేస్తాను. అమ్మయితే ఏమిటి, నాన్నయితే ఏమిటి?" అన్నాడు శివుడు.

అయితే, వారి వారి ఆలోచనా ప్రపంచాలలో మునిగి ఉన్నవారు తండ్రి రాకను గమనించలేకపోయారు. జరిగిన సంభాషణ అంతా విన్నట్లూ, అర్థం చేసుకున్నట్లూ ఆయన ముఖం మ్లానమై ఉంది.

"సత్యం ... శివం ..."

ఇద్దరూ తప్పు చేస్తూ దొరికిపోయి నట్లు తలలు వంచుకుని, వణికిపో తున్నారు.

"నేను తలియా వృద్ధుణ్ణే కాని, నా బుద్ధి చలించలేదు. ఇంకా పరిస్థితుల నర్థం చేసుకోగలిగే జ్ఞానం నాలో నశించ లేదు. నాకు ప్రపంచ జ్ఞానం ఉంది. మీలాంటి కొడుకుల్ని కన్నందుకు నేను నిజంగా గర్విస్తున్నాను."

వినవు [illegible] తండ్రి మాటలు. కొడుకు లిద్దరూ కంపించి పోయారు.

"మన బతుకుల్లాగే ఉంది దేశ పరిస్థితి. ఈ దేశంలో పేరెంట్ హోమ్స్ లేవు మరి. మీరు మంచివాళ్ళు కనక అమ్మనీ, నాన్ననీ ఎలాగో ఒక లాగ పోషించవలసిన బాధ్యతను అంగీకరించి అమలు జరప బోతున్నారు. అందుకు నాకు చాలా ఆనందంగా ఉంది. కాని—"

కుర్రాళ్ళిద్దరికీ తల ఎత్తి చూడ డానికి ధైర్యం చాలడం లేదు.

"నేనూ సంసార బాధ్యత నడిపిన వాడినే. ఆ బరువు నాకూ తెలుసు. నేనూ గుమాస్తాగా బ్రతుకు తెల్లవార్చు కున్నవాడిని కనకే మిమ్మల్ని పెద్దవాళ్ళని చెయ్యలేకపోయాము."


"నాన్నా!"

"బాధపడకండి. నా మాటలని మీరు మరోలా అర్థం చేసుకోకండి. నేను నిజమే చెప్తాను. మనఃస్ఫూర్తిగానే మాట్లాడు తున్నాను. ఎవరి బతుకు వారికే బరువై పోయిన ఈ గడ్డు దినాలలో మరొకరిని పోషించడమంటే మాటలు కాదు. తండ్రికి కొడుకూ, కొడుక్కి తండ్రీ కూడా బరువే. కాలం అలా మండి పోతోంది."

"అది కాదు, నాన్నా ..."

"తొందరపడకురా, సత్యం. నన్ను పూర్తిగా చెప్పనీ. నేను మిమ్మల్ని తప్పు పట్టబోవడం లేదు. మీరు చక్కని కొడుకులు. అంతేకాదు, మంచి అన్న దమ్ములుకూడా. నా కళ్ళతో చూస్తు న్నాను కదా? అన్నదమ్ములంటే ఉప్పూ నిప్పూలాగే ఉంటున్నారు. మీరు మాత్రం రామలక్ష్మణులే. ఒకరి కొకరు చేదోడు వాదోడుగా ఉంటారు. మంచి అయినా, చెడ్డ అయినా మనసు విప్పి మాట్లాడుకుంటారు. ఇదీ నాకు ఆనంద దాయకమే."

శివుడూ, సత్యమూ పశ్చాత్తాప పడు తూనే ఉన్నారు. ఇటువంటి విషయం ఇంట్లో మాట్లాడడం తప్పే. నాన్నని గమనించకుండా నోరు జారడం నేరమే.



పాత కట్టడం

ఫోటో— బి. పి. రెడ్డి, ( హైదరాబాదు )

"అంతా బాగానే ఉంది. కాని, మీరు ఏర్పాటు చేసుకున్న ఎన్నిక మాత్రం సరిగా లేదు. అందుకే నేను సవరించా లనుకుంటున్నాను. దీనివల్ల పెద్ద తేడా ఉండదు. మీరూ అంగీకరిస్తారని ఆశిస్తున్నాను."

శివుడూ, సత్యమూ మౌనంగా చూశారు.

"ఇన్నాళ్ళూ మీ అమ్మా, నేనూ ఒకే చోట, ఒకే గూటిలో ఉంటూ వచ్చాం. ఒకరి నొకరము విడిచి ఉండలేనంత అలవాటు పడిపోయాం. ఇప్పుడు మమ్మల్ని చెరొక చోటికి విసిరెయ్యడం మీకూ న్యాయం కాదు. అదీకాక మీ రిద్దరూ మమ్మ ల్నిద్దరినీ సమంగా అభిమానిస్తూ వచ్చారు. అందుచేత అమ్మా, నాన్నలలో ఏ ఒకరనేది తేల్చుకోవడం మీకూ కష్టమే.

అందుచేత ... అందుచేత నేనూ, మీ అమ్మా ఏడాది కారు నెలలు ఒక ఇంటా, మిగిలిన ఆరు నెలలూ రెండో వాడి ఇంటా ఉంటాం. దీనివల్ల మీకూ అట్టే ఇబ్బంది కలగ దనుకుంటాను. ఈ పద్ధతి మాకూ సుఖంగానే ఉంటుంది. కాక పోతే ఆరు నెలల కోసారి రెండు బస్సు టిక్కెట్లు ... అంతే."

ఇద్దరు కొడుకులూ అప్పటికే కన్నీటి పర్యంతం అయారు.

ఒక్కసారి — "అలాగే!" అన్నారు.

"మొదటి ఆరు నెలలూ మేము ఎవరి వద్ద ఉండాలో ఎన్నుకొని మాకు చెప్పండి" అనేసి ఆయన అక్కడినుండి వెళ్ళి పోయారు. *